క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎవరు?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నికపై రెండు రోజులుగా ఉత్కంఠ సాగుతుంది. గత నెల 30 వ తేదీన భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగగా.. అదే రోజు సాయంత్రం పోలైన ఓట్లను లెక్కించారు. కాగా అధ్యక్షులుగా పోటీలో నిలబడిన రెండు ప్యానల్లకు చెందిన న్యాయవాదులకు సరిసమానంగా ఓట్లు పోల్ అయ్యాయి. దీంతో అధ్యక్షుడి ఎన్నిక తాత్కాలికంగా వాయిదాపడింది. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఏడాది కాలం ఉండే ఈ బార్ అసోసియేషన్ అధ్యక్షుడి పోస్టుకి మొదటి ఆరు నెలల వరకు చైతన్య, తదుపరి ఆరు నెలలు అధ్యక్షుడిగా దేవదానాన్ని ప్యానెల్ సభ్యులు అంగీకారం మేరకు నియమించినట్లు సమాచారం. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాస చారీ, జాయింట్ సెక్రటరీగా సీహెచ్.విద్యాధరి, లైబ్రరి సెక్రటరీగా పి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బి.రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు ఎన్నిక కాగా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా సాయి రమస్‌సా, లేడీ రిప్రజెంటేటివ్‌గా కవితను ఎన్నుకున్నారు.

పీఓకు గొత్తికోయల వినతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలోగల రేగళ్లగుంపు గ్రామ గొత్తికోయలు సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌కు కలిసి వినతిపత్రం అందించారు. రేగళ్లగుంపు గ్రామానికి తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, చేతి పంపును మంజూరు చేసి తాగునీటి ఇక్కట్లు తొలగించాలని వినతి చేశారు. గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని, ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇప్పించాలని పీఓను కోరారు. స్పందించిన పీవో చేతి పంపు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎంపీ అభ్యర్థి పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి, కోయ నర్సాపూరం తదితర గ్రామాల్లో మహబూబాబాద్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి డాక్టర్ మహిపతి అరుణ్ కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలో లంబాడీల తొలగింపే లక్ష్యంగా పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండి మానుకోటపై ఆకుపచ్చ జెండా ఎగురవేసి ఆదివాసుల సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు, ప్రధాన కార్యదర్శి పరమ అరుణ్ కుమార్, గుండు వాన సంక్షేమ పరిషత్ నేతలు వర్షం ఉందా, రాజు తెల్లం, రామకృష్ణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లోకి రావాలి..

దమ్మపేట: సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపుకు వెళ్లే సత్తుపల్లి డిపో ఆర్‌టీసీ బస్సులు దమ్మపేట బస్ స్టేషన్‌కు రావాలని కోరుతూ.. సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మికి మండల కాంగ్రెస్ నాయకులు, స్థానికులు విన్నపం చేశారు. సోమవారం దమ్మపేట గ్రామంలోని స్థానిక ఆర్‌టీసీ బస్‌స్టేషన్‌ను సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి పరిశీలించారు. బస్‌స్టేషన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలసిన మండల కాంగ్రెస్ నాయకులు, స్థానికులు.. బస్‌స్టేషన్ సమగ్రంగా అభివృద్ధి చేసి, బస్‌స్టేషన్‌లోకి బస్సులు వచ్చేలా చేయాలని కోరారు. నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, పగడాల రాంబాబు, వలీపాషా, యార్లగడ్డ బాబు, పోతినేని వెంకట్రావు, చిన్నశెట్టి గోపి, చక్కిరాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ ప్రారంభించాలి

ములకలపల్లి: తునికాకు సీజన్‌కు సంబంధించి వేలంకాని యూనిట్లను ప్రభుత్వమే చేపట్టి, ఆకు సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లాకమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఆకుల కట్టకు ధర 5 రూపాయలు చెల్లించాలని అన్నారు. బోనస్ బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, మండలకమిటీ సభ్యులు యర్రర గొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, ఒరుగంటి శ్రీను పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చర్ల: న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు మూల స్తంభాలుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందిస్తే నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తుండడం హేయమైన చర్య అని, వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని జాతీయ మాలమహానాడు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గణపతి, రాష్ట్ర నాయకుడు తడికల లాలయ్య డిమాండ్ చేశారు. సోమవారం చర్లలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ రక్షణకు ఈ నెల 8 వరకు జరుగనున్న రాజ్యాంగ రక్షణయాత్రకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యాత్రను విజయవంతం చేయాలన్నారు. మాలమహానాడు గౌరవ అధ్యక్షుడు మోతుకూరి ప్రభాకరరావు, మండల అధ్యక్షుడు రుంజా రాజారావు, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- అప్పుడే మద్దతు ధర దక్కుతుంది..
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచన
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


దమ్మపేట: గణేష్‌పాడులో ధాన్యం కాంటా వేయిస్తున్న జీసీసీ మేనేజర్, సిబ్బంది, రైతులు


బూర్గంపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఏడీఏ తాతారావు


అశ్వారావుపేట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయబ్ తహసీల్దార్ సుచరిత

బూర్గంపాడు: రైతులుప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరలను పొందాలని ఏడీఏ తాతారావు సూచించారు. మండల కేంద్రం బూర్గంపాడులో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని సంజీవరెడ్డిపాలెం, నాగినేనిప్రోలు, మోరంపల్లిబంజర, సోంపల్లి, లక్ష్మీపురం, కృష్ణసాగర్, ఇరవెండి గ్రామాలలో కూడా సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయా కార్యక్రమాలలో మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్, ఏఎంసీ కార్యదర్శి నిర్మల, పర్యవేక్షణాధికారి శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుంపెన సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమయ్యాయి. అన్నపురెడ్డిపల్లి, గుంపెన, ఊటుపల్లి, నామవరం, అబ్బుగూడెం, తెలిజెర్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ అధికారులు మొదలుపెట్టారు. గుంపెన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం మండలంలోని దమ్మపేట, మల్కారం, గణేష్‌పాడు, జగ్గారం, గండుగులపల్లి గ్రామాల్లో జీసీసీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీసీసీ మేనేజర్ సుగ్గల నరసింహారావు మాట్లాడారు. స్థానిక రైతులు, నాయకులు, జీసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: గుంపెన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ చంద్రశేఖర్ రెడ్డి

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఊట్లపల్లి రోడ్ నందు సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సుచరిత, మానిటరింగ్ ఆఫీసర్ బి.ఏడుకొండలు, పీఏసీఎస్ సెక్రటరీ మానేపల్లి విజయ్‌బాబు, ఏఈఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ఎంతో మేలు

భద్రాచలంఅర్బన్: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఇటీవల భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ పిలుపు మేరకు పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజల సహకారంతో ఏర్పాటు చేసేందుకు విరాళాలు అందాయి. ఆ విరాళాలతో కొనుగోలు చేసిన 32 సీసీ కెమెరాలను సోమవారం ఏఎస్పీ తన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళాలు అందించిన ఆటో యూనియన్ సభ్యులకు, స్థానిక వ్యాపారులు, పట్టణ ప్రజలను ఆయన అభినందించారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించ వచ్చని అన్నారు. భద్రాచలం పోలీస్ స్టేషన్‌పరిధిలోని అన్ని కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని, పట్టణంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. పిల్లలను సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100 ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు పీవీఎన్‌రావు, విజయలక్ష్మి, ట్రాఫిక్ ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్, సిబ్బంది

'కేసీఆర్‌కు తగ్గని ఆదరణ'

మణుగూరురూరల్: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదని, ప్రజల్లోకి కేసీఆర్ వస్తున్నారంటే కాంగ్రెస్ మంత్రులకు భయం పుట్టుకొస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పర్యటనపై కాంగ్రెస్ మంత్రులు చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వస్తుండడంతో ప్రజల్లో కాంగ్రెస్‌కు ఎక్కడ ఆదరణ పోతోందోనని కాంగ్రెస్ మంత్రులకు భయం పట్టుకుని ఆవేశం, ఆందోళనలో ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాసి నల్లగొండలో పర్యటించాలని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన పాపాలు మరిచి మంత్రులు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు చెబుతున్న అబద్ధాలను, చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు.

దేశాన్ని కాపాడుకోవాలి..

మణుగూరురూరల్: భారతదేశాన్ని మతోన్మాదశక్తుల నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంటరి ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఇష్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అభ్యర్థి మురళీకృష్ణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జె.సీతారామయ్య, భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావులు మాట్లాడారు. 2014లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వడం, నల్లడబ్బును రప్పించి ప్రతీ కుటుంబానికి రూ.15లక్షలు ఇవ్వడం, రైతన్నల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఇచ్చిన హామీలను అమలు పర్చక పోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగులను, ప్రజలను, రైతులను మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ప్రధాని మోదీ దేశంలో మతోన్మాద మంటలను రేకేత్తిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని, అనుచరులుగా ఉన్న రాజకీయ పార్టీలను చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో న్యూడెమోక్రసి, విప్లవ పార్టీలను గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.ఉమా, ఆర్.లక్ష్మి, డివిజన్ అధ్యక్షురాలు కె.రాధ, వినోద, కొండలరావు, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ పథ్ సంచలన్


ర్యాలీ నిర్వహిస్తున్న కర సేవకులు

మణుగూరురూరల్: మణుగూరులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం పథ్ సంచలన్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పూలమార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ.. అంబేడ్కర్ సెంటర్ మీదుగా కొనసాగింది. ర్యాలీలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 2025నాటికి వంద సంవత్సరాలు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌ను విస్తరించేందుకు ప్రణాళికలకు రూపొందించడం జరిగిందని ప్రతినిధులు పేర్కొన్నారు. పథ సంచలన్ ర్యాలీలో బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి ఫీడర్ పరిధిలోని లైన్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ నర్సింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిప్పనపల్లి, పెనగడప, మహ్మద్‌నగర్, వెంకటాపురం, సత్యనారాయణపురం గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ములకలపల్లి: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో గుర్తు తెలియని వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. పాల్వంచ నుంచి దమ్మపేట వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళుతుండగా.. మండలపరిధిలోని కొత్తగంగారం శివారులో అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో బైక్‌పైఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఓటర్ల జాబితా అందజేత

భద్రాచలం: ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని కొత్తగూడెం నియోజకవర్గం ఎన్నికల, విద్యావంతుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తుది ఓటర్ల జాబితాను డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య పార్టీ నాయకులకు అందజేశారు. సోమవారం భద్రాచలంలో జరిగిన కార్యక్రమంలో ఈ జాబితాను కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతుకూరి ధర్మారావు, ఇతరులకు అందజేశారు. వీరయ్య మాట్లాడుతూ.. బూత్ కమిటీలను, అన్ని శాఖల కార్యకర్తలను ఎన్నికలకు సంసిద్ధం చేయాలని సూచించారు.

తుమ్మల పరామర్శ

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం నాగుపల్లి గ్రామంలో ఒగ్గు లక్ష్మీనారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనను తుమ్మల పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఇటీవలే మృతి చెందిన గూడపాటి భద్రయ్య, పొన్నగంటి సూర్యనారాయణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ సీతానగరం గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన కొప్పుల నీలయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిలక వెంకట రమణ రెడ్డి 40 కేజీ బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్ణశాల మాజీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, స్వర్ణలత, రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

చర్లరూరల్: మండలంలోని దేవరపల్లి గ్రామంలో సోమవారం కారం ఆనంద్ బాబు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ ప్రారంభించారు. తెల్లం లక్ష్మీనారాయణ, ఆకోజు సునీల్ కుమార్, ఐనవోలు పవన్ కుమార్, కారం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలోనూ మట్టి మాఫియా


తవ్వకాలు జరుపుతున్న జేసీబీ

అశ్వారావుపేట: మైదాన ప్రాంత ప్రజల మట్టి అవసరాలను మట్టి వ్యాపారులు ఆసరాగా చేసుకుని ఏజెన్సీ ప్రాంతంలో కూడా మట్టిని వదలట్లేదు. మట్టి అక్రమ రవాణాకు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఇప్పటికే కాజేశారు. ఎక్కడికక్కడ మినీ ఓపెన్‌కాస్టులను తలపించేలా భారీ గుంతలను పెట్టేశారు. ఇది చాలదన్నట్లు ఏజెన్సీలోని వ్యవసాయ భూములను కూడా భారీ గుంతలుగా మార్చేస్తున్నారు.

సోమవారం ఉదయం మండలంలోని కేశప్పగూడెం గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్లకు దిగువన ఉన్న ఓ పోడుపట్టా భూమిలో ఇళ్లకు ఆనుకుని భారీ గుంత చేస్తూ అశ్వారావుపేటకు మట్టి తరలిస్తున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లకు ఆనుకుని మైనింగ్ చేసి భారీ చెరువును తవ్వడంతో రానున్న రోజుల్లో వారికి ప్రమాదాలు పొంచి ఉన్న సంగతి గిరిజనులు గుర్తించలేకపోతున్నారు. వర్షానికి వరదనీరు ఇళ్ల మధ్య నుంచి గుంతలోకి వచ్చి చేరేక్రమంలో ఇళ్ల మధ్య మట్టి కోతకు గురయి ఇళ్ల ఉనికికే ప్రమాదం సంభవించే ముప్పు ఉంది. అంతేకాకుండా ఇళ్లకు ఆనుకుని చెరువు, నీటి కుంట ఏర్పాటయితే దోమలు విజృంభిస్తాయి. చిన్నపిల్లలు పడిపోయే ప్రమాదముంది. అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి మట్టి మాఫియా ఇలాంటి అక్రమ రవాణాకు పాల్పడుతోంది. అధికారులు చర్యలు తీసుకోకుంటే వీరి ఆగడాలకు అదుపు ఉండనట్లే. విషయాన్ని తహసీల్దార్ కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా తాము, తమ సిబ్బంది రెండ్రోజులపాటు అందుబాటులో ఉండమని.. విషయాన్ని పోలీసుకుల తెలియజేసి కట్టడి చేయాలని సూచిస్తామన్నారు.

భగీరథ నీరు ఇవ్వాలని ధర్నా

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందని గ్రామాల ప్రజలు తమకు నీరు ఇవ్వాలటూ ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీరు ఇస్తున్నామంటూ వేలకోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన పెట్టి ప్రజలను ఏప్రిల్ ఫూల్ చేసిందని విమర్శించారు. మండలంలో సగానికి పైగా గ్రామాలకు తాగడానికి నీరు అందటం లేదని చాలా గ్రామాలలో గోతులు తీసి వదిలేశారని అన్నారు. చాలా గ్రామాల్లో కొత్త పైప్ లైన్ వేయకుండా పాత పైప్ లైన్‌కు కనెక్షన్ ఇచ్చి బిల్లులు చేసుకున్నారని తెలిపారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వ పరంగా విచారణ చేయిస్తామని, అవినీతి కాంట్రాక్టర్లు, అధికారులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి నిరంధించే విధంగా మా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ధర్నా చేసిన ప్రజల తరపున ఎంపీఓకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం లక్ష్మీనగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, పీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల రవికుమార్, నాయకులు బత్తుల శోభన్ బాబు, తోటమల్ల సుధాకర్, పూజారి సూరి చందర్రావు, తెల్లం హరి, భూరం మనీ, నటరాజ స్వామి, అప్పల రెడ్డి,డింగి సందీప్ రెడ్డి, వేమన రెడ్డి, పిలక వెంకటరమణరెడ్డి ఎంపీటీసీలు తెల్లం భీమరాజు, మద్ది వనజ, సోషల్ మీడియా జిల్లా చైర్మన్ కనుబుద్ధి దేవ, మాజీ సర్పంచ్‌లు మడకం చంద్రశేఖర్, చిన్నారావు, నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పొదెం వీరయ్య, స్థానికులు

అనారోగ్యంతో ఇద్దరు బాలికలు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని మంగవాయిబాడవ బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాక వర్షిత (14) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం వైద్యశాలలో మృతి చెందింది. వర్షిత అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా గత నెల 20వ తేదీన విద్యార్థిని తండ్రి సామిరాజు ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ఇంటికి తీసుకునివెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాడు. కాగా సోమవారం ఉదయం ఇంట్లో ఉండగా వాంతులు కావడంతో హుటాహుటీన మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి వర్షిత మృతి చెందింది. విద్యార్థిని మృతిపై పాఠశాల హెచ్‌యం వీర కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు.

గండులపల్లిలో..

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామంలో మెచ్చు వెంకటేశ్వరరావు కుమార్తె తేజస్వీ(15), గత కొద్ది సంవత్సరాలుగా దీర్ఘకాలిక అనార్యోగంతో చికిత్సపొందుతోంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, మెచ్చు వెంకటేశ్వరరావు అతి సమీప బంధువు. కాగా తేజస్వీని మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే.. సోమవారం ఆ బాలిక భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పలువురు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

అన్నపురెడ్డిపల్లి: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక కోరారు. సోమవారం మండల పరిధిలోని గుంపెన కాలనీ సమీపంలో పనిచేస్తున్న జామాయిల్ కూలీలకు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున ఉదయం, సాయంత్ర సమయంలోనే పనిచేయాలన్నారు. తలకు రుమాలు కట్టుకోవాలని, ద్రవ పదార్థాలను తీసుకోవాలని సూచించారు. తలతిరగడం, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వైద్యశాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు


భద్రాచలంఅర్బన్: పాన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న టౌన్ ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది


అన్నపురెడ్డిపల్లిలో ఎస్సై చంద్రశేఖర్..


చంద్రుగొండలో ఎస్సై రవి..

భద్రాచలంఅర్బన్: పాన్‌షాపుల్లో భద్రాచలం టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అనేక చోట్ల పాన్ షాపుల్లో పిల్లలకు అమ్ముతున్న చాక్లెట్లు రూపంలో నిషేధిత గాంజాయి చాక్లెట్లను అమ్ముతూ పట్టుబడుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి భద్రాచలం టౌన్ పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. పాన్ షాపులలో విక్రయించే పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లతో పాటు గుట్కా ప్యాకెట్లు, చాక్లెట్లను పరిశీలించారు. గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో సోదాలు నిర్వహిస్తున్నట్లు టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రం, దీనికి తోడు ఏజన్సీ ప్రాంతం కావడంతో ఈ తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో అధిక శాతం బ్యాచిలర్స్ ఉండడం వల్ల నిషేధిత ఉత్పత్తులకు బానిసలయ్యే అవకాశం ఉంటుందన్న కోణంలోనూ తనిఖీలు చేశారు. టౌన్ ఎస్సై విజయలక్ష్మి, పీవీఎన్ రావు, ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్, పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని పాన్‌షాపుల్లో ఎస్సై మాచినేని రవి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేశారు. గంజాయితోపాటు మత్తు పదార్థాలు అమ్మకాలు చేస్తున్నారా అనే అనుమానంతో ఈ తనిఖీలు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి: షాపుల్లో మత్తుపదార్థాలు విక్రయించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పలు షాపులలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలు విక్రయించే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.